

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గురువారం 30, మే 2024







# దందా షురూ

- ఇంచార్జ్ రాగానే కోడ్ పడుతుంది
- తన నమ్మకస్తుడితో పని చక్కబెట్టిస్తున్న వైనం
- సత్తుపల్లిలో నో.
- .వైరా,అశ్వారావుపేట, కొత్తగూడెం లో ఎస్.
- ఆదార్ కార్డ్ లో అడ్రస్ మార్చుతున్న కేటుగాళ్ళు
- ప్రమాదం జరిగితే బాధ్యులెవరూ అధికారులా...ఏజంట్లా...?
- వీరి తీరుతో కుటుంబాలు రోడ్డు పాలు
- వీరిపై ఏ.సి.బి అధికారులు ఓ కన్నేయాలంటున్న వాహనదారులు ,ప్రజలు

2 లో..

**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్** గత కొన్ని రోజులు నుండి సత్తుపల్లి ఎం.వి.ఐ కార్యాలయంలో అక్రమం,అవినీతికి తావు లేకుండా నూతంగా భాద్యతలు తీసుకున్న మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సిన్సియారిటీగా విధులు నిర్వహిస్తున్నారు.ఆయన సిన్సియారిటీతో అక్రమాన్నే ఆదాయ వనరుగా మలచుకున్న కొందరి ఏజంట్ల ఆటలు సాగకపోవటంతో నానా తంటాలు పడుతున్నారు. ఈ సమయంలోనే ఏనుగుకు ఎలక్కాయ దొరికిన చందాన,దళారులకు బాగా సుపరిచితుడైన ఓ అధికారి ఇంచార్జ్ గా రావటంతో దందా షురూ చేశారు.అధికారి కూడా కాస్త చెయ్యి వాటం కలిగిన వ్యక్తి కావటంతో ఏజెంట్లకు లైన్ క్లియర్ అయ్యిందని వాదన వినిపిస్తోంది.

## పాఠశాలల పున: ప్రారంభం లోగా అమ్మ ఆదర్శ పనులన్నీ పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్



2 లో..

## సిటీలో ప్రారంభమైన ఆర్టీసీ మినీ బస్ ల సర్వీస్



2 లో..

# మైక్రో ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం



- వెలుగు చూసిన మైక్రో ఫైనాన్స్ వేధింపులు
- బయటకు గెంటి ఇంటికి తాళం వేస్తామన్న సిబ్బంది
- పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించిన బాధితురాలు

2 లో..

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**
మైక్రో ఫైనాన్స్ ఆగడాలు మరోసారి వెలుగు చూశాయి. ఒక పేద కుటుంబం మైక్రో ఫైనాన్స్ వేధింపులకు నానా ఇబ్బందులకు గురైంది. గతంలో మైక్రో ఫైనాన్స్ ఆగడాలకు, వేధింపులకు అనేక కుటుంబాలు అవమానాలు భరించలేక ఆర్థికంగా, మానసికంగా బలైపోయాయని మైక్రో ఫైనాన్స్ దౌర్జన్యాలు బయటికి రావడంతో అప్పటి ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకుంది.






# దందా షురూ




ఇంచార్జ్ అధికారి రావటంతో ఫైళ్ళని చక,చకా కోడ్ లతో కార్యాలయానికి క్యూ కట్టి, అక్రమం ఊపందుకున్నట్లు తెలుస్తుంది.అప్పటి వరకు ఆన్ లైన్ ఫీజుతో నిఖచ్చిగా అయిన పనులు.ఇంచార్జ్ అధికారి ప్రవేశంతో అమ్యామ్యా రుసుము జతకలిసినట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా ఈ అక్రమ తతంగా అంతా ఆ అధికారికి అతి దగ్గరగా ఉండే ఓ ఏజెంట్ చేతుల నుండే జరిగిందని తెలుస్తుంది.ఇప్పటి వరకు ఆ ఏజెంట్ పై వందల ఫిర్యాదులు ఉన్నా ఆయనకే కొందరు అధికారులు వత్తాసు పలుకుతుండటం విశేషం.అంతేకాకుండా సత్తుపల్లి ఎం.వి.ఐ కార్యాలయంలో శాశ్వత అధికారి నిజాయితీగా పని చేస్తుండటంతో తమ ఆటలు ఇక్కడ సాగవని సత్తుపల్లిలో నో అంటూ, అక్రమ ఫైళ్ళను అశ్వారావుపేట, కొత్తగూడెం,వైరా ఎం.వి.ఐ కార్యాలయాలకు పంపి ఎస్ అనిపించుకుంటున్నట్లు వినికిడి,అక్కడకు వెళ్ళే ఫైళ్ళలో సగానికి పైగా ఆదార్ కార్డ్ అడ్రస్ మార్పులు జరుగుతున్నట్లు గుస,గుసలు గట్టిగానే వినిపిస్తున్నాయి.ఇందుకు సంబందించిన పత్రాలు సైతం బహిర్గతం కావటం కొసమెరుపు. అక్రమ సంపాదనే ధ్యేయంగా పని చేసే ఏజంట్లకు, అధికారులు అండ తోడవుతుండటంతో వాహనదారుల జేబులు గుల్ల కావటమే కాకుండా, ప్రమాదాలు జరిగిన సమయంలో పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పనికి ఆదార్ కార్డును ప్రామాణికం చేస్తుండగా , దళారులు కొందరు ఆన్ లైన్ సెంటర్ నిర్వాహకులతో కుమ్మక్కై ఆదార్ కార్డ్ లను మార్ఫింగ్ చేస్తున్నట్లు తెలుస్తుంది.గతంలో సత్తుపల్లి ,పెనుబల్లి,కల్లూర,తిరువూరు కేంద్రాలుగా నఖిలీ ఇన్స్యూరెన్స్ లు,ఆదార్ కార్డులు,వాహన బదీలలో కావాల్సిన తప్పుడు పత్రాలను కొన్ని నెట్ సెంటర్ లను అడ్డాలుగా చేసుకుని దళారులు సృష్టించటం పాఠకులకు విధితమే.దళారులకు పైసలు ఇస్తే పాకిస్తాన్ టెర్రరిస్ట్ లకు సైతం సత్తుపల్లి, కొత్తగూడెం,అశ్వారావుపేట, వైరా అడ్రస్ లతో ఆదార్ కార్డులను సృష్టించేలా ఉన్నారు.ఆదార్ కార్డ్ అసలుదా,నఖిలీదా అని చూడాల్సిన అధికారులు సైతం కాసులకు కక్కుర్తి పడి సంతకాలు చేస్తుండటం విశేషం.ఏ.సి.బి అధికారులు సత్తుపల్లి, వైరా,అశ్వారావుపేట, కొత్తగూడెం ఆర్.టి.ఐ కార్యాలయాలను తనిఖీ చేయాలని అప్పుడే అసలు బండారం బ య ట ప డ ు త ం ద ం ట ు న్నా ర ం వాహనదారులు,ప్రజలు.ఇప్పటికైనా రవాణా శాఖ కార్యదర్శి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆర్.టి.ఐ కార్యాలయాలు,బోర్డర్ చెక్ పోస్టులపై ఓ కన్నేసి అవినీతి అధికారుల భరతం పట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మైక్రో ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం



అయినా కొన్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలు నిబంధనలను బుట్టదాకలు చేసి పేద ప్రజలను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గుర్తిస్తుంది. తాజాగా పెనుబల్లి మండలంలో మైక్రో ఫైనాన్స్ వేధింపులకు ఓ కుటుంబం అనుమానాలకు గురయ్యింది.నెల వాయిదా చెల్లించడంలో పది రోజులు ఆలస్యం అవవడంతో తమను ఇంటి నుండి బయటకు గెంటి వేసి ఇంటిని స్వాధీనం చేసుకుంటామని మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వేధిస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించింది. పెనుబల్లి మండలం ఉప్పలచలక గ్రామానికి చెందిన బూషిరాణి తన కుటుంబ అవసరాల కోసం 60 వేల రూపాయలను సిఎఫ్ఎల్ అనే మైక్రో ఫైనాన్స్ కంపెనీ వద్ద రుణంగా తీసుకున్నారు. ప్రతినెల అనుకున్న తేదికి వాయిదాలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల వాయిదా చెల్లించటం ఆలస్యం అవ్వడంతో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో మైక్రో ఫైనాన్స్ సిబ్బంది తమ ఇంటికి వచ్చి ఇంటి నుండి బయటికి వెళ్లిపోవాలని ఇంటిని స్వాధీనం చేసుకుంటామని దుర్భాషలాడుతూ తమను బయటకు గెంటివేసారని భయభ్రాంతులకు గురి చేశారని బాధితురాలు వీ.ఎం. బంజర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త రత్తయ్య లారీ డ్రైవర్ గా పని చేస్తాడని జీతం రెండు రోజులు ఆలస్యంగా రావడంతో అనుకున్న సమయానికి వాయిదా చెల్లించలేకపోయామని తెలిపింది. మైక్రో ఫైనాన్స్ సిబ్బందిని వేడుకున్న వినకుండా తమ ఇంటిలోకి ప్రవేశించి వేధింపులకు గురి చేస్తున్నారని బాధిత మహిళ వాపోయింది. తన భర్త ఇంట్లో లేని సమయంలో రాత్రి 9,10 గంటల మధ్య సమయంలో సదరు ఫైనాన్స్ సిబ్బంది వచ్చి ఇప్పటికిప్పుడే వాయిదా చెల్లించాలని డిమాండ్ చేస్తూ దుర్భాషలాడుతుండడంతో బాధిత మహిళ తన పిల్లలు భయభ్రాంతులకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త మరుసటి రోజు వస్తారని వాయిదా డబ్బులు చెల్లిస్తామని ఎంత చెప్పినా వినకుండా మానసికంగా చిత్ర హింసలు గురిచేసి అవమానించారని బాధితురాలు విఎం బంజర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తమ కుటుంబాన్ని వేధిస్తున్న ఫైనాన్స్ సంస్థ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఫిర్యాదులో పేర్కొంటూ వేడుకుంది.

## సిటీలో ప్రారంభమైన ఆర్టీసీ మినీ బస్ ల సర్వీస్.

ఖమ్మం సిటీలో పాత బస్టాండ్ నుంచి,కొత్త బస్టాండ్ కు వెళ్లి ఎక్స్ ప్రెస్ బస్ ల కోసం ప్రయాణికులు వెళ్ళాలన్న... కొత్త బస్టాండ్ లో దిగి పాత బస్టాండ్ కు వెళ్లి పల్లె వెలుగు బస్ ల కోసం వెళ్ళాలన్న ప్రయాణికుల ఖర్చుల ఇబ్బందుల దృశ్య ఖమ్మం ఆర్టీసీ సంస్థ రీజియన్ మేనేజర్ సిహెచ్.వెంకన్న కొరత తీర్చేందుకు లోకల్ మినీ బస్ సర్వీస్ లను బుధవారం నుంచి ప్రారంభించారు.ఈసర్విస్ లు ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మాత్రమే ఉంటోందన్నారు.

## పాఠశాలల పున: ప్రారంభం లోగా అమ్మ ఆదర్శ పనులన్నీ పూర్తి చేయాలి





ఖమ్మం, (సూర్య బ్యూరో): పాఠశాలల పునఃప్రారంభం లోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులన్నీ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్, రఘునాథపాలెం మండలం వేపకుంట్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖమ్మం నగరం రాపర్తినగర్ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల, బురహాన్ పురం విద్యానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల, ఖమ్మం రూరల్ మండలం కొత్తూరు (వై), చిన్న తాండ లోని మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలలు సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల క్రింద మంజూరు నిధులు, చేపట్టిన పనులు, పూర్తి చేసిన పనులు, ఇంకనూ చేయాల్సిన పనులు, పూర్తికి సమయం అడిగి తెలుసుకున్నారు. రన్నింగ్ వాటర్ తో నూతన టాయిలెట్లు, టాయిలెట్ల మరమ్మత్తులు, పాఠశాల గదుల చిన్న చిన్న మరమ్మత్తులు, త్రాగునీరు, విద్యుత్ పనులు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, పెయింటింగ్ తదితర పనులు పూర్తి కావాలన్నారు. పాఠశాల ఆవరణలో, ప్రవేశం దగ్గర వెలుతురు వుండేలా వీధి లైట్ ఏర్పాటుచేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలు



ఏర్పాటుచేసి, వారికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన పనులు అప్పగించిందని అన్నారు. అన్ని మౌళిక సదుపాయాలతో పాఠశాలలకు కొత్త హంగులు సమకూరుతున్నాయన్నారు. బడి బాట కార్యక్రమాన్ని గొప్పగా చేపట్టి, నమోదులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, భోజనం, యూనిఫామ్ లు అందిస్తున్నట్లు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అంతకుముందు కలెక్టర్, రఘునాథపాలెం మండలం, వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ని పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ అప్పగించింది, ఎంతమేర పూర్తి చేసింది అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన యూనిఫామ్ లను పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం లోగా విద్యార్థులందరికీ యూనిఫామ్ అందేలా చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ తనిఖీల సందర్భంగా ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, డిఆర్డీవో సన్యాసయ్య, డిఇఓ సోమశేఖరశర్మ, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## జిల్లా లో పచ్చిరొట్టె,పత్తి విత్తనాలకు ఎటువంటి కొరత లేదు

### కావల్సినంత అందుబాటులో ఉన్నాయి.

### కలెక్టర్ వి పి గౌతమ్

**ఖమ్మం, సూర్య బ్యూరో మే 29:** జిల్లాలో పచ్చిరొట్టె, పత్తి విత్తనాలకు ఎలాంటి కొరత లేదని, కావాల్సినంత అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుండి జిల్లాకు 21,276 క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనం కేటాయింపులు జరిగి, జిల్లాకు 14,067 క్వింటాళ్ల విత్తనం చేరుకుందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు 8,908 క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనం అమ్మకం జరగగా, ఇంకనూ 5,159 క్వింటాళ్ల విత్తనం అందుబాటులో వున్నదని, అదే కాకుండా ఇంకా విత్తనాలు వస్తాయని ఆయన తెలిపారు. జిల్లాలో వర్షాకాలంలో 2,01,834 ఎకరాల్లో పత్తి పంట సాగు అంచనా వున్నదని, ఒక ఎకరాకు 2 ప్యాకెట్ల చొప్పున పత్తి విత్తనాలు అవసరం అవుతాయని ఆయన అన్నారు. జిల్లాలో ఇప్పటికే 4,49,347 ప్యాకెట్ల పత్తి విత్తనం అందుబాటులో వున్నదని, బుధవారం నాటికి కేవలం 34,000 ప్యాకెట్ల పత్తి విత్తనాల అమ్మకం జరిగినట్లు ఆయన అన్నారు. కావున రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, కావాల్సిన దానికి అదనంగా విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ప్రశాంతంగా విత్తనాలు కొనుక్కోవచ్చని కలెక్టర్ అన్నారు.



# లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతం గా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలి

**- జిల్లా ఎన్నికల అధికారి వి.పి గౌతమ్**








ఖమ్మం, (సూర్య బ్యూరో): లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో లోకసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 4న ఉదయం 8 గంటలకు ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల నందు ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తుంచుకోవాలని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికీ ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటి సంభాషణలు పెట్టుకోవద్దని, ప్రశాంతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ లో మాత్రం 18 టేబుళ్లు ఏర్పాటు ఉంటుందని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ పూర్తిగా చెక్ చేసుకోవాలని, కంట్రోల్ యూనిట్ యొక్క పింక్ సీల్, గ్రీన్ ఫీల్డ్ చెక్ చేసి కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలని, కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్ ను సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ అన్నారు. కంట్రోల్ యూనిట్ లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికి క్లాక్ ఎర్రర్ వస్తే సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని, కంట్రోల్ యూనిట్ లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని అన్నారు. కంట్రోల్ యూనిట్ లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సి నందు నమోదైన ఓట్లు ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, టేబుల్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు సహాయ రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వివి ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవు తుందని, వివి ప్యాట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ.టి.పి.బి.ఎస్ విధానం ద్వారా సర్వీస్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారులు, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ అధికారులకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. శిక్షణ ఇవిఎం యంత్రాలతో మాక్ కౌంటింగ్ నిర్వహించి, కౌంటింగ్ ప్రక్రియ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బి. సత్యప్రసాద్, జి. గణేష్, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీవో సన్యాసయ్య, శిక్షణ నోడల్ అధికారి కె. శ్రీరామ్, సహాయ శిక్షణ నోడల్ అధికారి మదన్ గోపాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టెట్ లేకుండా ప్రమోషన్లు బదిలీలు జరపాలి

## సింగరేణిలో టీపీటీఎఫ్ దశాబ్ది ఉత్సవాలు..



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్** సింగరేణి(కారేపల్లి మే29)మండలంలోని ఉపాధ్యాయుల ప్రమోషన్లు,బదిలీలు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల అనుసరించి టెట్‌తో సంబంధం లేకుండా వెంటనే జరపాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు జీ.వెంకటేశ్వరరావు, మల్లం హరీష్ లు డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం సింగరేణి మండల వనరుల కేంద్రం వద్ద సంఘం పతాకాన్ని అవిష్కరించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేండ్లుగా ఉపాధ్యాయులకు బదిలీలు,ప్రమోషన్లు లేక తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. పెండిరగ్ డీఏలు,పీఆర్సీ,పీఆర్సీ బకాయిలు,వెంటనే చెల్లించాలని కోరారు. పాఠశాలలో ఖాళీలను డీఎస్సీతో భర్తీ చేసేంతవరకు వాలంటీర్లను నియమించి విద్యార్థుల చదువులకు అటంకం లేకుండా ప్రభుత్వం చూడాలన్నారు.అమ్మఆదర్శ పాఠశాల,మన ఊరు,మన బడి పాఠశాలలో మంజూరైన పనులకు నిధులు విడుదల చేయాలన్నారు.ప్రతి పాఠశాలకు గ్రామపంచాయతీలతో సంబంధం లేకుండా స్కావెంజర్‌ను నియమించాలని,ఎండ తీవ్రత దృష్ట్యా బడిబాటను వారం రోజులు వాయిదా వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు ఉడుగు సుధాకర్,అన్నవరపు దామోదర్, దేవరకొండ నాగభూషణం,చాగంటి నాగేశ్వరరావు,వెంకటేశ్వరరావు,కామల్ల సుందర్,రాచకట్ల మల్లేశ్వరరావు,కే ఇమ్మానియేల్ రాజు,అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన కొనుగోలు లో జాగ్రత్తలు పాటించాలి

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

విత్తన కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తీరణాధికారి బీ. శిరీష సూచించారు. మండలం లోని చెరువుమాధారం లో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వానాకాలం పంటలు సమీపిపస్తున్న నేపథ్యాన రైతులు విత్తనాలు తీసుకునే సమయంలో అప్రమతంగా ఉండాలని అన్నారు. రైతులు ప్రతీ విత్తనాలకు రశీదు తప్పకుండా తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో వచ్చే విత్తనాల ను ఎవరూ కూడ తీసుకోవద్దని సూచించారు. విత్తనాలు తేది,తయారీ, గడువు,సంస్థ పేరు, లేబుల్, డీలర్ సంతకం అన్నింటిని పూర్తిగా సరి చూసుకోవాలని అన్నారు. నూతన పద్ధతుల లో పంటలు సాగు చేయాలని సూచించారు.అదే విధంగా సబ్సీడీ పై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



# ఏన్కూరులో విత్తన దుకాణాల తనిఖీ



**ఏన్కూరు. సూర్య మేజర్ న్యూస్:** మండలంలోని విత్తన దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కరుణశ్రీ టాస్క్ ఫోర్స్ బృందంతో కలిసి తనిఖీ చేశారు.బుధవారం ఏన్కూరు,బురద రాఘవపురం, తిమ్మారావుపేట గ్రామాల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విత్తన స్టాక్ రిజిస్టర్లు,ఇన్వాంఎన్ బిల్లులు,లైసెన్సులు,స్టాక్ బోర్డ్ లను తనిఖీ చేశారు.అనంతరం ఏడీఏ మాట్లాడుతూ పత్తి విత్తనాలను తగిన వర్షం 60 పడిన తర్వాతనే విత్తుకోవాలని సూచించారు.దలైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలనికోరారు.అపరిచిత వ్యక్తుల వద్దనుండి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు.పర్మిషన్ లేనటువంటి బిజీ 3 విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అట్టి వారి సమాచారాన్ని పోలీసులకు,వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ నరసింహారావు,ఎస్సై బాధావత్ రవి, ఏ ఈ ఓ లు బాలకృష్ణ,లహరి,నవ్య,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి మతతత్వ విధానాలపై నిరంతర పోరాటాలు

**అంతులేని అవినీతి కి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ నేతలు**

**సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత రావు**



**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్**

దేశవ్యాప్తంగా బిజెపి పార్టీ అవలంబిస్తున్న మతతత్వ విధానాలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత రావు వెల్లడించారు. బుధవారం మండలంలోని సాతాని గూడెం సిపిఐ నాయకురాలు చంద్ర శాంతమ్మ దశ దిన కర్మలు ముచ్చర్ల లక్ష్మీ ఫంక్షన్ హాల్లో జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన హేమంత రావు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రభుత్వ రంగాలను కాషాయికరణ చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో అంతులేని అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా బీఆర్ఎస్ నేతలు మారారని అన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ నేతలు అప్పుల కుప్పగా మార్చారని ఆయన ఆరోపించారు. ప్రజాధనాన్ని దోచుకొని అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ నేతల పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలన బాగుందని ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ పార్టీ మద్దతు ఇచ్చిందని కానీ ప్రజా సమస్యలను పరిష్కరించుకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మౌలిక అవసరాలను తీర్చడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు ఎర్ర బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతా దేవి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు మండల సహాయ కార్యదర్శులు సతాకోటి సత్యనారాయణ, సిరిపురపు ప్రభాకర్, బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నేరుపేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ



**వాసవి క్లబ్స్ అంతర్జాతీయ కార్యదర్శి రేగూరి హనుమంతరావు**



నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ మండల కేంద్రంలోని వాసవి భవనంలో నేలకొండపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం మరియు వర్తక సంఘం అధ్యక్షులు వాసవి క్లబ్స్ అంతర్జాతీయ కార్యదర్శి రేగూరిహనుమంతరావు జన్మదిన సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య సంఘం , నేలకొండపల్లి మండల వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చెవిటి,మూగ,నిరుపేదలకు 50 మంది సభ్యులకు నిత్యవసర సరుకులు వారందరికీ సంపక్తి భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి ఆనందంగా భోజనం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరూ రేగూరి హనుమంతరావు జన్మదిన శుభాకాంక్షలు తేలిపి దేవుడు చల్లగా చూడాలని కోరుకున్నారు.వచ్చిన ప్రతి ఒక్కరూ ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా జన్మదిన వేడుకలో చక్కటి సేవ కార్యక్రమం చేసిన వాసవి క్లబ్స్ వారికి,మండల ఆర్యవైశ్యసంఘం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ తెలిపారు. ఇలా వికలాంగులు,నిరుపేదలతో కలిసి భోజనం చేయటం, వారితో కలిసి ఉండడం సంతోషంగా ఉన్నదని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ ఆఫీసర్స్ గెల్లా జగన్మోహన్రావు,ఎర్రం సుజాత,ఉమ్మడి ఖమ్మం జిల్లా గవర్నర్ గుమ్మడవల్లి శ్రీనివాస్,కార్యదర్శి గోళ్ళ రాధాకృష్ణమూర్తి,కోశాధికారి మాశెట్టి వరప్రసాద్,ఆర్య సంఘం బాధ్యులు కొత్త వేణుబాబు,తెల్లాకుల అశోక్,జిల్లా ఆఫీసర్స్ రేగూరి వాసవి ఎంపీటీసీ, దోసపాటి చంద్రశేఖర్, తెల్లాకుల అశోక్ గల్లా కృష్ణారావు,కొత్త కరుణ,కొత్త రాణి, కొత్త రమేష్,గేల్లా వెంకటరమణ గుప్తా,క్లబ్ అధ్యక్షులు దోసపాటి నాగేశ్వరరావు,వల్లభ పరిమళ,అత్తులూరి నాగలక్ష్మ,ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అన్నదాతలకు జీలుగులు పంపిణీ

**సాగు ప్రయోజనాలను రైతులకు వివరించిన ఏఈఓ నాగసాయి**

బోనకల్, సూర్య (మేజర్ న్యూస్ ): మండల పరిధిలోని కలకోట గ్రామంలోని పిఏసీఎస్ ఆద్వర్యంలో రైతులకు బుధవారం పచ్చి రొట్ట విత్తనాల (జీలుగలు )పంపిణీ చేశారు పంట పొలాల్లో జీలుగులు సాగు వల్ల పొందే ప్రయోజనాల గురించి స్థానిక వ్యవసాయ విస్తరణాధికారి నాగ సాయి మాట్లాడుతూ సాధారణంగా హరిత మొక్కలను పంటలేనపుడు లేదా రెండు పంటల వ్యవధిలో తక్కువ కాలంలో ఎక్కువ పచ్చి రొట్ట ఇచ్చే మొక్కలను పెంచి నేలలో కలియ దున్నడం ద్వారా నేలకు పోషకాలు అందించవచ్చునన్నారు. హరిత మొక్కల సాగు ద్వారా నేల భౌతిక స్థితి మెరుగుపడి నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుందని, నేలలో అందుబాటులో లేని పోషకాలను కూడా ప్రధాన పంటకు లభ్య రూపంలోకి తీసుకువస్తాయన్నారు. కలుపు మొక్కల పెరుగుదలను నిరోధిస్తాయని, చౌడు భూముల పునరుద్ధరణ జరిగి నేలలు తటస్థ స్థితికి చేరుకుంటాయని, సూక్ష్మ పోషకాలను చిలెట్లు గా మార్చి ప్రధాన పంటకు అందేలా చేస్తాయని తెలిపారు. రసాయన ఎరువుల లభ్యతను కూడా పెంచుతాయని, హరిత మొక్కల పైర్లు ఎరువుల గానే కాకుండా పశువుల మేతకు కూడా వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు. హరిత మొక్కల సాగు ద్వారా నేలకు సేంద్రియ పదార్థాన్ని చేకూర్చడం వలన సూక్ష్మజీవుల ద్వారా జరిగే రసాయనిక చర్యల వలన నేల సారం మరియు నేల ఉత్పాదకతను పెంపొందించవచ్చునన్నారు జరిగింది.ఈ కార్యక్రమంలో సహకార సంఘము కార్యదర్శి వనమా మల్లికార్జున్, సంఘ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**



పెనుబల్లి మండలం లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుబల్లి మండలం భయం గూడెం సాయి నగర్ వద్ద బుధవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని డోజర్ ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తిరువూరు పట్టణానికి చెందిన గువ్వల సతీష్, పింగల శ్రీను అనే ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. తిరువూరు నుండి బైక్ పై వి ఎం బంజర్ గ్రామంలో టైల్స్ వేసే పనికి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధమ చికిత్స అందించి అనంతరం తిరువూరు కి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఆటో డ్రైవర్ తోట రామకృష్ణ హుటాహుటిన తన ఆటోలో గాయపడిన ఇద్దరు వ్యక్తులను ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చి మానవత్వం చాటుకున్నాడు. రామకృష్ణ స్పందించిన తీరుకు పలువురు ప్రశంసించారు.

## నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి ఏడిఏ విజయ చంద్ర

**అధికృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి..**

**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్..** రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూసుమంచి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయచంద్ర అన్నారు.కూసుమంచి మండలంలోని గుర్వాయిగూడెం,పోచారం గ్రామాల్లో బుధవారం రైతులకు విత్తనాల కొనుగోలు నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలర్ల వద్ద నుండి బిల్లులతో పాటుగా డీలర్,రైతు సంతకం,తయారీ,ఎక్స్పైరి తేదీ, లాట్ నంబర్ సరిచూసుకోని కొనుగోలు చేయాలని సూచించారు.తీసుకున్న బిల్లులను,ఖాళీ ప్యాకెట్లను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని తెలిపారు.ఎవరైనా గుడ్డ సంచులలో గ్రామాలలో తిరుగుతూ నకిలీ లేబుల్ తో ఉన్న ప్యాకెట్ విత్తనాలు అమ్మినట్లయితే ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి వారి వద్ద విత్తనాలు తీసుకోవద్దని వారి వివరాలను వ్యవసాయ శాఖ,పోలీసు శాఖ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు.లైసెన్స్ కలిగిన అధికృత డీలర్ నుండి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.అదే విధంగా రైతులు తొందరపడి ప్రత్తి గింజలను విత్తకూడదని ,కనీస వర్షపాతం 60 మిల్లీమీటర్లు ఉన్నప్పుడు మాత్రమే విత్తుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి,ఏఈవోలు ప్రియాంక,సాయిరాం ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# నకిలీ మాయగాళ్లతో జాగ్రత్త

**నకిలీ విత్తనాలతో మోసపోవద్దు**

**విత్తన డీలర్లతో సమావేశం**

**ఏడి నరసింహారావు, ఎస్ ఐ. వెంకటేష్**




**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**ప్రభుత్వ అనుమతి లేని నాసిరకం విత్తనాలు విక్రయాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ అధికారులు హెచ్చరించారు. పెనుబల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక నందు బుధవారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఊళ్లోజు నరసింహారావు, వియ్యం బంజర్ ఎస్సై కే వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని తప్పనిసరిగా బిల్ ఇవ్వాలని తెలిపారు. అన్ని రకాల పత్తి వంగడాలు మంచివేనని ప్రత్తి వంగడం సరైన భూసార నేలల్లో నాటినప్పుడు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి ఆ వంగడం నుండి ఆశించినంత దిగుబడి వస్తుందని అంతే కానీ ఫలానా వంగడమే మంచిది అనే అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. రాత్రి వేళల్లో ఇండ్ల వద్దకే తక్కువ ధరకు విక్రయిస్తామని వస్తే వెంటనే వ్యవసాయ శాఖ వారికి సమాచారము ఇస్తే పోలీసు వారి సహకారంతో అలాంటి వారికి శిక్ష పడేలా చేయవచ్చని తెలిపారు. డీలర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎస్ఐ కె. వెంకటేష్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని రైతు క్షేమంగా ఉంటే మనం అందరం క్షేమంగా ఉంటామని అన్నారు. రైతు బాగుంటేనే అన్ని వ్యవస్థలు బాగుంటాయని అన్నారు. రాత్రి వేళల్లో గుడ్డ సంచుల్లో విత్తనాలు విక్రయించే వారి పట్ల జాగ్రత్త ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వ గుర్తింపు లేని విత్తనాలు, అనధికార షాపుల్లోని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. రైతులు మాయగాళ్లకు మోసపోయి నష్టపోకూడదని మాయగాళ్లు తారసపడినప్పుడు వ్యవసాయ శాఖ వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చి రైతులను అలాంటి మోసగాళ్ళ బారిన పడకుండా కాపాడాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి ప్రసాదరాజు వ్యవసాయ విస్థరణ అధికారులు మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా సుదర్శన హెూమం..





అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)– మండల కేంద్రంలోని వైష్ణవాలయం శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రం (శ్రవణా నక్షత్రం) పురస్కరించుకొని సుదర్శన హెూమాన్ని వైభవోపేతంగా జరిపించారు. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు ప్రతాపురం ప్రసాదాచార్యులు సంప్రదాయ రీతిలో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో హెూమగుండంలో నెయ్యి, సమిధులను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన సుదర్శన హెూమం ప్రాముఖ్యత, విశిష్ట గురించి వివరించారు. కోరికలను నెరవేర్చి, ఆరోగ్యం, సంపద, శాంతి, శ్రేయస్సును అందించే అత్యంత శక్తివంతమైన హెూమం సుదర్శన హెూమం అని, ఈ హెూమం చేపించడం వలన అన్ని రకాల ఆర్థిక సమస్యలు అడ్డంకులను తొలగించి విజయవంతం చేసే శక్తివంతమైన హెూమం అన్నారు. ఈ హెూమం జరిపించిన , తిలకించిన అన్ని రకాల దోష నివారణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వరావు దంపతులు పాల్గొన్నారు. హెూమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ మాట్లాడుతూ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతినెల శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని సుదర్శన హెూమం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. హెూమంలో పాల్గొనదలచిన భక్తులు ఆలయ సిబ్బంది 8008184555, 9701951243 ,9912325329, 9849727108, ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

**–బాలాజీ ఆలయ సందర్శర్థం చిన్న జీయర్ స్వామి:–**

ఈనెల 30 న గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ సందర్శర్థం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి విచ్చేస్తున్నారని, ఆయన స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు సూక్తులు, ప్రవచనాలు బోధిస్తారని, ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ మేనేజర్ పిలుపునిచ్చారు.

## కాచన పల్లి అమరవీరుల, ఆశయ సాధనలో అంకితమవుదాం.-జె. సీతారామయ్య.

ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)– భూమికోసం,భుక్తి కోసం,పేద ప్రజల విముక్తి కోసం రక్త తర్పణ చేసిన కాచన పల్లి అమరవీరుల ఆశయ సాధనలో అంకితం అవుతామని సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం వరంగల్ జిల్లాల ఏరియా నాయకులు జే.సీతారామయ్య అన్నారు. కాచన పల్లి అమరవీరుల 33 వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఇల్లందు మండలం కొల్లాపుర%శీ%లో కాచన పల్లి అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీతారామయ్య మాట్లాడుతూ రాజ్యం బూటకపు ఎన్కౌంటర్లు చేయిస్తుందనటానికి సజీవ ఉదాహరణే గొందిగూడెం, కాచన పల్లి లలో చేసిన బూటకపు ఎన్కౌంటర్లని,ఆ ఎన్కౌంటర్లో కోటన్న, సర్పంచ్ చింతా లక్ష్మి, టేకులపల్లి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ నోముల పరశురాములు, రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా నంబూరి సీతారామారావు, గర్భవతి అయిన తన భార్య సుశేనా లను అత్యంత కిరాతకంగా, దుర్మార్గంగా చిత్రహింసలకు గురి చేసి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. కాచనపల్లి ఎన్కౌంటర్ జరిగి 33 ఏళ్ళు అవుతున్నా ఇప్పటికీ తమ త్యాగాలు మన బాధ్యతను గుర్తు చేస్తున్నాయని వారు అన్నారు. అంతకంటే ముందు, 1969లో ఇదే రోజున నక్సల్బరీ పొలికేకతో ముందుకొచ్చిన భారత విప్లవోద్యమ తొలి అమరులు బత్తుల వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, బిజ్జ వెంకన్న లను కూడా బూటకపు ఎన్కౌంటర్లో రాజ్యం హత్య చేసిందని వారు తెలిపారు. త్యాగానికి కొలమానం బలిదానం మాత్రమేనని,ఆ కోవలోకి కాచనపల్లి అమర వీరులు, గొందిగూడెం అమరవీరులు, ముస్మీ, లడాయి గడ్డ, రోల్లగడ్డ, అనేకమంది అమరవీరులు వస్తారని తెలిపారు. విప్లవద్యమంలో అమరులైన కాచన పల్లి అమరవీరులకు, గొందిగూడెం అమరవీరులకు విప్లవ జోహార్లు తెలియజేశారు. వారి ఆశయ సాధనలో పయనించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ల రమేష్,నాగేశ్వ రరావు, పివో డబ్ల్యు జిల్లా కార్యదర్శి మోకాళ్ల సుగుణ,సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



## విత్తన షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు

**– నకిలీ విత్తనాలు విక్రయిస్తే బైండోవర్ కేసులు నమోదు**

**– వ్యవసాయ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు**



చంద్రుగొండ, సూర్య (మేజర్ న్యూస్)–మండల పరిధిలోని చంద్రుగొండ, రావికంపాడు, పోకలగూడెం, గ్రామాల్లోని విత్తన షాపులను బుధవారం వ్యవసాయ శాఖ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపు యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఏవో జి వినయ్ మాట్లాడుతూ విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. రైతులకు విత్తనాలకు సంబంధించిన బిల్లును కచ్చితంగా ఇవ్వాలన్నారు. రైతులు కోలుగోలు చేసిన విత్తన వివరాలను ఆ బిల్లుపై తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. రైతులు బిల్లు తీసుకునే సమయంలో బిల్లుపై తప్పనిసరిగా సంతకం చేసి ఆ బిల్లును తమ వద్దే ఉంచుకోవాలన్నారు. అనుమతులు లేని విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ మాచినేని రవి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విత్తనాలనే విత్తన డీలర్లు విక్రయించాలన్నారు. అలా కాదని నకిలీ విత్తనాలను ఎవరు విక్రయించిన అట్టి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం పాటు చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే షాపుల యజమానుల ప్రమేయం లేకుండా ఎవరైనా బయట వ్యక్తులు వచ్చి గ్రామాల్లో విత్తనాలు అమ్మితే వెంటనే పోలీసు వారికి లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు కూడా విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.



## మాలోత్ కవిత, రాకేష్ రెడ్డి ల గెలుపు ఖాయం

**– తెలంగాణ ఉద్యమ నాయకుడు ఖాజా**



ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)–మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్ పై పోటీ చేసిన మాలోత్ కవిత, అదేవిధంగా ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ఏనుగుల రాకేష్ రెడ్డి ల విజయం ఖాయమని తెలంగాణ ఉద్యమ నేత, పార్టీ సీనియర్ నాయకులు ఎండి ఖాజా వెల్లడించారు. అమలు చేయలేని ఆరూ గ్యారంటీలను ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నవ్వుల పాలు అయిందని ఖాజా విమర్శించారు. మోసపోయామని తెలుసుకున్న తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని ఆయన అన్నారు.

## ఎండదెబ్బకు మృతి చెందిన రజబెల్లి

**–మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.**



ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)– గత 30 సంవత్సరాలుగా ఇల్లందు బొగ్గు కాటా వద్ద కార్మికుడిగా పనిచేసిన రజబెల్లి సంవత్సర కాలంగా బొగ్గు అందుబాటులో లేకపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు అడ్డా మీద పనికి వెళ్లే వాడని ఈ క్రమంలో బుధవారం ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు మృతి చెందాడని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఇల్లందు పట్టణ కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి తెలిపారు. రజబెల్లి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కోల్ ట్రాన్స్పోర్ట్ అధ్యక్షులు వరద రామచంద్రయ్య నల్ల శ్రీను, లారీ ఓనర్స్ అధ్యక్షులు షేక్ మౌలానా మృతుని ఇంటికి వెళ్లి మృతుడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సర కాలంగా బొగ్గు అందుబాటులో లేకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకునేందుకు కొందరు హైదరాబాద్ కు వెళ్లారని మరికొందరు ఇల్లందు అడ్డ మీద పనికి వెళుతుండే వారిని ఈ క్రమంలో ఎన్నడూ లేని ఎండను తట్టుకోలేక రజబలి వడదెబ్బకు బలి అయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రజబలికి భార్య,నలుగురు కూతుర్లు ఉన్నారని నలుగురు కూతుళ్లకు పెళ్లి చేయగా ఒక కూతురికి విడాకులై ఇంటి మీదనే ఉన్నదన్నారు. నిరుపేద రజబల్లి కుటుంబాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఆళ్ల నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీను, కుక్కల దుర్గారావు, దేవర వీరస్వామి, పెంటి శ్రీను, సూరిబాబు, మోటం శీను, టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్లా,ఎండి.రహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

## మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేట, సూర్య (మేజర్న్యూస్)–అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ బుధవారం అశ్వారావుపేట మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లిలో కుంజా వెంకటేశ్వరరావు, ముందుగా జమ్మిగూడెం గ్రామానికి చెందిన సింగలూరి కృష్ణ కుమార్తె ఓణీల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అదే విధంగా వేదాంతపరం గ్రామానికి చెందిన కూన సింహాచలం అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని గోపన్నగూడెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కబడి గంగరాజు కుటుంబాన్ని జారె పరామర్శించారు. ఈ క్రమంలో ప్రభుత్వం తరపున పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని అన్నారు. అదే విధంగా గ్రామంలో కలియ తిరిగి గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు కాంగ్రెస్ జూపల్లి రమేష్, ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కారుణ్య మృతిపై సిట్టింగ్ జడ్జి చే విచారణ జరిపించాలి


**– పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్...**



భద్రాచలం సూర్య( మేజర్ న్యూస్)– భద్రాచలంలో మారుతీ మెడికల్ కళాశాలలో మే 23వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన కారుణ్య మరణం పట్ల అనేక అనుమానాలకు తావిస్తుందని, కారుణ్య హత్య పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని దీనికి మారుతి కళాశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృధ్వీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా మహాజన సోషలిస్ట్ పార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లత డిమాండ్ చేశారు. బుధవారం భద్రాచలం పట్టణం సీపిఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యాలయంలో పిడిఎస్‌యూ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి శివ ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మారుతీ మెడికల్ కళాశాలలో గడిచిన 10 యేండ్ల కాలంలో దళిత ఆదివాసి కుటుంబాలకు చెందిన విద్యార్థినిలు లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతూ అత్యాచారాలకు గురవుతున్నారని వారు ఆరోపించారు. మారుతి కళాశాలలో గతంలో జరిగిన మరణాల పట్ల కళాశాల సిబ్బంది,యాజమాన్య పాత్ర పై అనేక అనుమానాలు ఉన్నా సమగ్ర విచారణ జరగక పోవడంతో ఈ నిర్లక్ష్యపు కారణాలవల్ల నేడు విద్యార్థిని కారుణ్య మృతికి బలమైన కారణాలు అయ్యాయని వారు తెలిపారు. గతంలో మాదిరిగానే కారుణ్య మృతి రహస్యాలను కూడా బయటకు పొక్కకుండా కళాశాల యాజమాన్యం తమకు ఉన్న ఆర్థిక రాజకీయ అంగ బలాన్ని ఆసరాగా చేసుకుని కారుణ్య మృతిని పలు విధాలుగా తప్పు దోవ పట్టించేందుకు తీవ్ర ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే భద్రాచలం పట్టణం నడి ఒడ్డున మా బిడ్డ మృతికి మారుతి కళాశాల యాజమాన్యమే కారణం అని కారుణ్య తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆవేదనకు లోనై మాకు న్యాయం చేయండి అని వేడుకున్న వారిని తప్పుడు మార్గంలో వారికి డబ్బు ఎరవేసి వారి నోరులను కట్టివేశారని తెలిపారు. మీడియా సాక్షిగా వారు మా బిడ్డ మరణానికి మారుతి కళాశాల యాజమాన్యమే అని పలు రకాల వీడియోలు మన ముందు ఉన్నప్పటికీ రాత్రికి రాత్రే బాధితులతో తప్పుడు సాక్షాలను సృష్టించి బయటి సమాజానికి రాతపూర్వకంగా వారి బిడ్డ మరణానికి కళాశాల యాజమానికి ఏమి సంబంధం లేదని చెప్పించిన తీరు తీవ్ర ఆవేదన కలిగిస్తుందని వారు తెలిపారు. బాధిత కుటుంబం క్రిస్టియన్ మతానికి సంబంధించిన వారని, వారి సాంప్రదాయం ప్రకారం మృతదేహాన్ని బాక్స్‌లో పెట్టి పూడ్చి పెట్టాలి కాని భవిష్యత్తులో ఎటువంటి సాక్షాధారాలు లభించకుండా డెడ్ బాడీని మారుతి కళాశాల ఒత్తిడి మేరకు మంటల్లో దహనం చేశారని తెలిపారు. బాధిత కుటుంబం తో రహస్య ఒప్పందాలు చేసుకొని వారిని బయటికి రానియకుండా చేసినా జరిగిన సంఘటన అత్యంత దారుణమైనదని భవిష్యత్తులో మరొక విద్యార్థి ఇటువంటి ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోకుండా చర్యలు చేపట్టే విధంగా ఉండడం కోసమే పి డి ఎస్ యు,దళిత సంఘాలు కారుణ్య మృతిపై సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. విద్యార్థి సంఘాలు, దళిత సంఘాలు చేసే న్యాయ పోరాటానికి భద్రాచలం పట్టణ ప్రముఖులు,ప్రజాసామిక వాదులు, మేధావులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ దళిత శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, అనుసూచిత్ జాతి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను, కొంచర్ల కుమారి, గద్దల కృష్ణవేణి, ఎస్కే సల్మా, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు మాదిగ, పింగళి నాగరాజుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం ద్వారా అరకొరగా విత్తనాలు పంపిణీ

- ప్రభుత్వం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- పది సంవత్సరాలుగా విత్తన కొరత చూడలేదు








చంద్రుగొండ, సూర్య (మేజర్ న్యూస్)–సహకార సంఘం ద్వారా అరకొరగా విత్తనాలను పంపిణీ చేయడం పట్ల రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలపరిధిలోని గానుగపాడు సహకార సంఘం పరిధిలోని చంద్రుగొండ, రావికంపాడు, గానుగపాడు, పరిధిలోని మూడు సెక్టార్లో ఉన్న రైతులకు జీలుగు విత్తనాలను బుధవారం అరకొరగా పంపిణీ చేశారు. దీంతో రైతులు ప్రభుత్వ తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా మూడు సెక్టార్ పరిధిలోని 38 గ్రామాలకు చెందిన రైతులు జీలుగు విత్తనాల కోసం గానుగపాడు గ్రామంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయానికి బారులు తీరారు. అయితే రైతులకు అందించాల్సిన 100 శాతం విత్తనాలు 50 శాతం కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు విత్తనాల కోసం పోటీపడ్డారు. 30 కేజీల జీలుగు విత్తనాల బ్యాగులు కేవలం 415 రావడంతో అధికారులు సైతం రైతులకు ఇవ్వడానికి తలలు పట్టుకున్నారు. ఓవైపు రైతుల పక్షపాతి ప్రభుత్వం అనుకుంటూ కనీసం రైతులకు ప్రారంభంలోనే విత్తనాలు అందించకపోవడంపై రైతులతో పాటు ప్రతిపక్ష నాయకులు కూడా ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పది సంవత్సరాల్లో ఎప్పుడు విత్తనాల కొరకు రాలేదన్నారు. ఇప్పటికైనా మండలానికి సరిపడా విత్తనాలను దిగుమతి చేసి రైతులు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

## 102, 1962లకు వాహన డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేట సూర్య, (మేజర్‌న్యూస్)–ఇఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ నందు 1962, 102 వాహనాల యందు పైలట్(డ్రైవర్) ఉద్యోగాల కొరకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అబ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్, ఒక జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకొని ఈనెల 31న భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)–పట్టణపరిధిలోని లారీ అసోసియేషన్ కళ్యాణ మండపంలో టీపీసీసీ సభ్యులు బాలశౌరి ద్వితియ పుత్రిక లీల, జీవన్ కుమార్ వివాహ వేడుకకు శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ,జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు,సీపీఐ జిల్లా సెక్రటరీ సాబీర్ పాషా, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మారుతి నర్సింగ్ కాలేజ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**–తోకల దుర్గ ప్రసాద్ ఎమ్మార్పీఎస్**



భద్రాచలం సూర్య (మేజర్ న్యూస్) – భద్రాచలం మారుతి నర్సింగ్ కాలేజ్ అనుమతులు ప్రభుత్వము రద్దు చేయాలని, కారుణ్య మృతికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. దళిత బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు కూడా కాలేజీ యజమాన్యం కారణం వల్లనే కారణ్యం మృతి చెందిందని మీడియా ముందు బలముగా వారి వాదనలు వినిపించిన కారణ్య తల్లిదండ్రులను డబ్బు ఎరవేసి వారిని లోపర్చుకున్నారని ఆయన అన్నారు.మారుతి కాలేజీలో చదువుతున్న విద్యార్థులు ఎస్టీ, ఎస్సీ విద్యార్థులని అమాయక విద్యార్థుల నుంచి కోట్ల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ వాళ్లకి కనీస సౌకర్యాలు రక్షణ, కల్పించలేనటువంటి కాలేజీ యజమాన్యం పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఎంతో భవిష్యత్తు ఉన్న దళిత బిడ్డ 18 సంవత్సరాల వయసు గల కారుణ్య అనుమానస్పద మృతికి కారకులైన వారిని ఎందుకు బయట పెట్టడం లేదని యాజమాన్యం తనకున్న డబ్బు రాజకీయ అండ బలముతో కేసును తప్పుతోవ పట్టిస్తున్నారని , గతంలో కూడ ఇటువంటి సంఘటనలు ఈ కాలేజీలో జరిగినటువంటి పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు వసూలు చేసుకుని డబ్బు సంపాదించుకోవడమే తప్ప వారి పట్ల జాగ్రత్తలు తీసుకోకుండా వాళ్లకు ఇష్టం వచ్చినట్లుగా యాజమాన్యం వ్యవహరిస్తుంది. కారుకులైనటువంటి వారిపై కఠినమైనటువంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో నిర్వహించబడుతున్న కాలేజీలను విజిట్ చేయాలని, నిబంధనలు పాటించని కాలేజీలపై ప్రభుత్వము తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

**–ఆదివాసీ సంఘాల జెఎసి, హ్యూమన్ రైట్స్ సంఘాలు**

భద్రాచలం, సూర్య(మేజర్‌న్యూస్)– మారుతీ పారామెడికల్ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంఘాల జెఎసి, హ్యూమన్ రైట్స్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలం ఐటిడిఎ ఎదుట నిరసన చేపట్టారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు చెందిన ఒక ఆడబిడ్డ అనుమానాస్పదంగా మరణిస్తే ప్రభుత్వ యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా ఉండడం శోచనీయమన్నారు.అగ్రవర్ణాలకు ఏదైనా అన్యాయం జరిగితే నిందితులను ఎన్కౌంటర్లు చేసారని బీఎస్సీ నర్సింగ్ ఫస్ట్ ఇయర్ చదువు తున్న కారుణ్య మృతిపై ఎందుకు సరైన విచారణ జరగడంలేదని ప్రశ్నించారు. మారుతి కళాశాల యాజమాన్యం ఒక్క అనుమతితో మూడు కళాశాలలు నడుపుతున్నదని తక్షణమే ఆ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.



# జిల్లాలో వర్షాకాల సీజన్ కు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**

కొత్తగూడెం కలెక్టరేట్,సూర్య (మేజర్ న్యూస్ )– జిల్లాలో వర్షాకాల సీజన్ కు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలో విత్తనాల లభ్యతపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు డీలర్ల దగ్గర అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెంద నవసరం లేదని తెలిపారు. జిల్లాలో పత్తి సాగు 2,16,625 ఎకరాలకు గాను 5,41,560 ప్యాకెట్లు, వరి సాగు 1,65,854 ఎకరాలకు అవసరమైన 41,464 క్వింటాల విత్తనాలు, మొక్కజొన్న సాగు 60,200 ఎకరాలకు అవసరమైన 4816 క్వింటాల



విత్తనాలు, మిర్చి సాగు 32,168 ఎకరాలకు అవసరమైన 32 క్వింటాళ్ల విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయాని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,47,044 ప్యాకెట్ల పత్తి విత్తనాలు రాగా, అందులో 29,130 ప్యాకెట్లు రైతుల కొనుగోలు చేశారని కలెక్టర్ తెలిపారు. జిలుగ, జనము మరియు పిల్లి పెసర 1311 క్వింటాళ్లు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో సాగు కనుగుణంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళనల చందనవసరం లేదని తెలిపారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు సరఫరా చేయాలని నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు లూస్ విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసిందని, కొనుగోలు చేసిన ధాన్యానికి గాను చెల్లింపులు పూర్తి అయినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఏడిఏ రవికుమార్,ఏవో రవికుమార్, సాయి నారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈ రోడ్డు నిర్మాణం పూర్తయేదెన్నడు !!!

**-ఎమ్మెల్యే ల ఆదేశాలు సైతం బేఖాతరు**
**-నిధులున్న పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు**
**-ఆ రోడ్డు పై ప్రయాణం నరక కూపంగా మారుతుంది**
**-ఇకనైన ఆర్ అండ్ బి అధికారులు నిర్మాణ పనులు చేపట్టాలి**



కొత్తగూడెం అర్బన్,సూర్య (మేజర్ న్యూస్) – జిల్లా కేంద్రమైన కొత్తగూడెం లోని రైల్వే స్టేషన్ నుండి పట్టణంలోని గొల్లగూడెం, హేమచంద్రాపురం, కోరుకొండ రామవరం మీదుగా ఇల్లందు బైపాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంగానే గత కొన్నేళ్లుగా పనులు పెండింగ్లో ఉన్నాయి. సదరు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆర్ అండ్ బి అధికారులకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు నేటి ప్రారంభం కాకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన ఉన్నత అధికారుల సమావేశంలో కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు అ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులలో చలనం లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు నుండి నిర్మాణ పనులు చేప్పట్టవలసి ఉండగా అధికారులు మాత్రం ఏవో కుంతీ సాకులు చెపుతూ పనులు ప్రారంభించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. 16వ వార్డు న్యూ గొల్లగూడెం పంచాయతీ సరిహద్దు ప్రాంతంలో, పంచాయతీ అధికారులు వర్షాకాలం దృష్ట్యా వారి పరిధి వరకు కొత్త సిసి రోడ్డు వేయించారు. కాని మున్సిపాలిటీ ప్రాంతమైన గొల్లగూడెం చివరి భాగాన ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు వేయడం మరిచారు. మున్సిపాలిటీ నుండి రూ 2 కోట్లు ఆర్ అండ్ బి శాఖకు నిధులు మంజూరు అయినా నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని మాజీ కౌన్సిలర్ మాచర్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఆ రోడ్డు పై ప్రయాణం నరక కూపంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రజలు అనేక ఇబ్బందుల పాలు అవుతున్నారని, ఈ రోడ్డు మొత్తం గుంతలుగా మారడం వలన వాహనదారులు కొంతమంది గాయాల పాలు కూడా అయ్యారని తెలిపారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే ఈ రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేసారు. లేకుంటే పెద్ద ఎత్తున రాస్తారోకో చేసి రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల రమేష్, మాజీ కౌన్సిలర్ యూసుఫ్, 18 వ వార్డు కౌన్సిలర్ చారి, ఒకటో వార్డు కౌన్సిలర్ విజయ్, దుర్గా, ఈశ్వర్, అక్బర్ సత్తి అజయ్ వెంకట్ సిపిఐ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల తో రైతులు నష్టపోవద్దు

**- ఇల్లందు డీఎస్పీ ఎన్.చంద్ర భాను**

ఆళ్ళపల్లి, సూర్య (మేజర్ న్యూస్)– మండలంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోవద్దని, ఇళ్ళందు డీఎస్పి చంద్రభాను అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ రతీష్ అధ్యక్షతన ఫర్టిలైజర్ డీలర్లు తో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయాలు అరికట్టేందుకు స్థానిక వ్యవసాయ శాఖ అన్ని విధాలా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులను చైతన్య పరచాలని, మండలంలో ఒక్క రైతూ కూడా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాడి తన పంట నష్టపోవద్దన్నారు. స్థానిక పోలీసులతో పాటు మండలంలో ఉన్న టాస్క్ ఫోర్స్ బృందం క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, షాపుల్లో సోదాలు



చేసి, శాంపిల్స్ చెక్ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండలంలోని అందరు డీలర్లు షాపుల్లో తప్పనిసరిగా లైసెన్స్ ప్రదర్శించాలని, రైతులకు పూర్తి వివరాలతో రశీదులు తప్పక ఇవ్వాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, ఫారం డీ సమర్పణ, లైసెన్స్ రెన్యువల్ చేయడం, షాపు మార్పు వివరాలు, తదితర వంటివి ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఎవరైనా గ్లైపో సెట్ లాంటి కలుపు మందు, హెచ్టీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని , నకిలీ విత్తనాలతో పాటు గడువు తేదీ ముగిసినవి అమ్మినా, లైసెన్స్ లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీ యాక్ట్ నమోదుకు సైతం వెనకాడమని స్పష్టం చేశారు. అధిక లాభార్జన కోసం డీలర్లు ప్రభుత్వ గుర్తింపు లేని వాటిని అమ్మొద్దన్నారు. మండలానికి బయటి నుంచి నకిలీ విత్తనాలు తెచ్చి రహస్యంగా అమ్మే వారి సమాచారం పోలీస్ శాఖకు అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ టి.సురేష్, ఆళ్ళపల్లి ఎఈఓ విజయ్ వంశీ, మర్కోడు, ఆళ్ళపల్లి, అనంతోగు, మామకన్ను, జగ్గుతండ వ్యాపారస్తులు అబ్బు నాగేశ్వరరావు, బూరుగడ్డ రాములు, నరెడ్ల శ్రీనివాసరావు, తాళ్లపల్లి నాగేశ్వరరావు, బూర్ణ రాంబాబు, కె.బసవయ్య, ఎస్.ప్రభాకర్, ఎఎస్ఐలు రాజేశ్వరరావు, వెంకట్ రెడ్డి, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం మాకు బహుమతి మీకు



అశ్వాపురం,సూర్య (మేజర్ న్యూస్) – మావోయిస్టులపై ప్రకటించిన రివార్డులు ఉన్న వివరాలతో కూడిన ఫ్లెక్సీలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశానుసారం మండలంలోని మొండికుంట, సీతారాంపురం, గొందిగూడెం, అశ్వాపురం, మల్లెలమడుగు, మిట్టగూడెం గ్రామాలలో సమాచారం మాకు బహుమతి మీకు అనే శీర్షిక ఫ్లెక్సీలను అశ్వాపురం పోలీసులు బుధవారం ఏర్పాటు చేశారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సంఘ విద్రోకశక్తుల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్ లో ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు.

## కాచనపల్లి అమరులకు విప్లవ జోహార్లు.




టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)– కాచనపల్లిలో కాల్చి చంపబడిన అమరుల 33వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో కాచనపల్లి అమరుల స్తూపం వద్ద పార్టీ నాయకత్వంలో నివాళి బుధవారం అర్పించారు. ఈ సందర్భంగా భూక్య హర్ష్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు సీతారామయ్య మాట్లాడారు. దోపిడి వ్యవస్థ నిర్మూల కోసం ప్రజారాజ్య స్థాపన కోసం గత 40 ఏళ్లుగా జరుగుతున్న ప్రతిఘటన పోరాటంలో అనేకమంది నాయకులు తమ నిండు జీవితాలను త్యాగం చేశార న్నారు. పొట్లరామనరసయ్య, నీలంరామచంద్రయ్య, జంపాల ప్రసాదు, శ్రీహరి మొదలు ఎల్లన్న, బాటన్న, దొరన్న, మురళి నిన్నటి లింగన్న, పాషన్న ముస్మీ అమరవీరుల వరకు అనేకమంది వీరులు మరణించి ఎర్రజెండాను మరింత ఎరుపు ఎక్కించి పోరాటాలకు పదును పెట్టారని తెలిపారు. ప్రజారాజ్యం కోసం దోపిడి వ్యవస్థ నిర్మూలన కోసం అమరుడు కలలుగన్న నూతన ప్రజాస్వామిక విప్లవం సాధన కోసం మరిన్ని పోరాటాలను నిర్మించాలని అమరులకు మన అర్పించి నిజమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పి. వై. యల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, మండల నాయకులు భూక్య నర్సింగ్, బొడ. మంచా, ధారవత్ భీక్య, తోటకూరి సతీష్, గుగుతోతు నాగేశ్వరరావు, మాలోత్ వసంతరావు, చందర్, వెంకన్న, జాను, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగ దొరికాడు

కొత్తగూడెం క్రైమ్,సూర్య(మేజర్ న్యూస్) – కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ లో వన్ టౌన్ సిఐ ఎం కరుణాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పద స్థితిలో కనిపించిన వ్యక్తిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు పరిపోయేందుకు ప్రయత్నించాడు. ఆ యువకుడిని పట్టుకుని ప్రశ్నించగా తన పేరు జుంజునురి శ్రీను అని దొంగతనాలకు వచ్చినట్లు అంగీకరించారు. పూర్తిగా విచారించగా ఇటీవల కాలంలో సింగరేణి క్వార్టర్ లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని,అదేవిధంగా గతంలో సింగరేణి క్వాటర్స్, ఎమ్మార్వో ఆఫీస్ వద్ద సంత వద్ద ఉన్న రెండు ఇండ్లలో దొంగతనం చేసినట్లు అంగీకరించినట్లు సి ఐ తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.



సూర్య
www.suryaa.com

గురువారం 30, మే 2024

# గ్రూప్ -1 పరీక్ష అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**-8875 మంది పరీక్షలకు హాజరు**

**-జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల ఏర్పాటు**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల.**





కొత్తగూడెం కలెక్టరేట్,సూర్య (మేజర్ న్యూస్)- గ్రూప్ -1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ డిఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జూన్ 9న జరగనున్న గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 8875 మంది పరీక్షలు హాజరుకానున్నారని, ఇందు కుగాను జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష జరిగే రోజు ఉదయం తగిన భద్రత మధ్య ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలను తరలించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎటువంటి గందరగోళానికి గురి కాకుండా కాకుండా ఒక ప్రధాన గేటు ద్వారానే పరీక్షా కేంద్రం లోపలకు వెళ్ళు విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోనికి అనుమతించాలని, 10 గంటలకి పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయ్యాలని ఆదేశించారు. అభ్యర్డులు బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా నిర్వహించాలని, తగిన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులు పరీక్ష కేంద్రాలలోనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్ష కేంద్రాలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పటిష్టమైన బందోబస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, కేంద్రాల వద్దకు ఇన్ టైంలో చేరేలా చూడాలని సూచించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజ్ జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్స్ చీఫ్ సూపరింటెంట్లు సమయం వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలని, అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ రవీందర్ నాథ్, టిజిపి ఎస్సి రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ జగన్మోహన్ రాజు, డి.ఎస్.పి రెహమాన్, కలెక్టరేట్ సూపరింటెంట్ తిరుమల చారి, చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్పాట్ బృందాలు, రూట్ ఆఫీసర్లు సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# హాస్పిటల్, క్లినిక్,యాగ్నొస్టిక్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి






**కొత్తగూడెం,సూర్య (మేజర్‌న్యూస్)-** జిల్లాలోని ప్రతి హాస్పిటల్,క్లినిక్ల,యాగ్నొస్టిక్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పేర్కొన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్మాట్లాడుతూ ప్రతి హాస్పిటల్, క్లినిక్ , డయాగ్నొస్టిక్ సెంటర్ ,ఆయుర్వేదిక్, యునాని ,హోమియో, సిద్ధ, ఫిజియోథెరపీ క్లినిక్లు, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి హాస్పిటల్ ఐపి ,ఓపి, ఓటి, రిజిస్టర్స్, కేసు షీట్స్ మెయింటెన్ చేయాలని ,ప్రతి మూడు నెలలకి ఒకసారి జిల్లా వైద్యాధికారికి నమోదు ఐన వ్యాధులు పట్టిక పంపాలన్నారు. జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్స్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారి మీద కఠిన చర్యలు తీసుకొనబడునన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి, డిస్టిక్ టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ద్వారా ప్రతి ఒక్క హాస్పటల్ ని తనిఖీ చేయాలన్నారు. ప్రతి హాస్పిటల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్. జెవిఎల్ శిరీష, డాక్టర్ .రవిబాబు డిసిహెచ్ ఎస్ డాక్టర్ సుకృత, డాక్టర్ రాజకుమార్ ,డిప్యూటీ డిఎంహెచ్ ఓ, ప్రోగ్రాం ఆఫీసర్స్ ఐఎంఏ ప్రెసిడెంట్స్ డాక్టర్ ఏ భాస్కరరావు, రంగారావు, సుదర్శన్, డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందజేయాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా .**





**కొత్తగూడెం టౌన్ ,సూర్య (మేజర్ న్యూస్)-** అన్ని పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తగూడెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనంద్ ఖని నందు గల బుక్స్ గోడౌన్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ పాఠ్యపుస్తకాల పంపిణీ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకి రావలసిన అన్ని పాఠ్య పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయని, అన్ని మండల కేంద్రాలకు అన్ని పాఠ్య పుస్తకాలు సరఫరా అవుతాయని, పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలను అందజేసే విధంగా ప్రణాళికను సిద్ధం చేశామని తెలియజేశారు.మొత్తం 4,46,280 పాఠ్య పుస్తకాలను మండల కేంద్రాలకు చేరుకొని, అక్కడ నుండి అన్ని పాఠశాలలకు ఈ వారంలో చేరుకుంటాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా కొత్తగూడెం మండలానికి చెందిన పాఠ్య పుస్తకాలను మండల విద్యాధికారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి , జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఏ. నాగరాజ శేఖర్, యస్. కె. సైదులు, మండల విద్యాధికారి జుంకీ లాల్, బుక్స్ గోడౌన్ ఇంచార్జ్ రవి ప్రతాప్, విద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**

కొత్తగూడెం కలెక్టరేట్,సూర్య (మేజర్ న్యూస్ )- రాబోయే వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పేర్కొన్నారు.బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి పాటించాల్సిన జాగ్రత్తల గురించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత గురించి రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్, జిల్లా , ప్రాథమిక వైద్య కేంద్రం స్థాయిలో పాటు చేయడం జరిగిందని అధికారులు కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా కేసుల నివారణ గురించి ఇంటింటిని సందర్శించి చివర కేసులను గుర్తించి, తగిన వైద్యం అందించి ఆరోగ్య కేంద్రానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. రాబోయ వర్షాకాలంలో ముందు జాగ్రత్తగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. మున్సిపాలిటీపరిధిలో కాలువలు పూడిక తీయించాలని మున్సిపల్ కమీషనర్ లను ఆదేశించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ లలో పారిశుద్ధ సిబ్బంది తో కాలువలలోని బురద తీయించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఐటిడిఏ పిఓ ప్రతిక్ జైన్ మాట్లాడుతూ డెంగ్యూ మరణాలు జరగకుండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి శిరీష, డాక్టర్ రవి బాబు, డాక్టర్ రాధా మోహన్, డాక్టర్ రాకేష్ కుమార్, డాక్టర్ స్పందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com
గురువారం 30, మే 2024

# రైతులను ఆదుకోవాలని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా




ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)– వ్యవసాయ రుణాలు బ్యాంకుల ద్వారా ఇచ్చి వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకోవాలని ఇల్లందు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బుధవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యదలపల్లి సత్యం మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఇల్లందు ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్ణయించామని తెలిపారు. వానకాలం ప్రారంభం కావడంతో పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారని ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ 2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని, రైతులకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల వ్యాపారులు ఇదే అదునుగా భావించి పురుగుమందుల కంపెనీలు రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రభుత్వ యంత్రాంగం గట్టి చర్యలు తీసుకొని అదుపు చేయాలని ఆయన కోరారు. రుణాలను జూన్ లోనే మాఫీ చేయాలని తెలిపారు.వర్షాల కారణంగా తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు, వ్యవసాయ పరికరాలను 75% సబ్సిడీతో రైతాంగానికి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎమ్మార్వో కోట రవికుమార్ కు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు జే.సీతారామయ్య, కార్మిక నాయకులు ఎండి.రాసుద్దీన్ ,పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి భయ్య శారద, సహాయ కార్యదర్శి మోకాళ్ళ సుగుణ, ఐఎఫ్టియు నాయకులు ఎల్.రవి,శ్రీను, మండల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలి

**–జి.యం జాన్ ఆనంద్**



ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)–సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా వారి ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జయప్రదం చేయాలని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ కోరారు. ఈ సందర్భంగా ఏరియా అధికారులతో జరిగిన సమీక్ష సమావేశం లో మాట్లాడారు. జూన్ 2 తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అన్ని గనులు,విభాగాలలో నిర్వహించాలని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆనంద్ సూచించారు. జూన్ 2వ తేదీన ముందుగా జీఎం కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేసి, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకొని, జగదంబ సెంటర్ లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలవేసి అక్కడినుండి జే.కే స్కూల్ గ్రౌండ్ వరకు తెలంగాణ పరుగును నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సాయంత్రం 6 గంటలకు సింగరేణి పాఠశాల మైదానం నందు నిర్వహించే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను, ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాలు అలాగే వేడుకల్లో సింగరేణి సేవా సభ్యులు, స్థానిక మహిళలతో తెలంగాణ రుచులు, తినుబండారాల స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ వేడుకలు హాజరైయ్యే సింగరేణి సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పుర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూ జి.యం మల్లారపు మల్లయ్య, జే.కే ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, ఐ.డి ఇంజనీర్ గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, డిజియం పర్సనల్ జి.వి మోహన్ రావు, డిజియం సర్వే బాలాజీ నాయుడు, ఇతర అధికారులు ధనుంజయ రెడ్డి, క్రిస్టపర్, యూసఫ్, మహేష్, అంజి రెడ్డి, పవన్ కుమార్, నాగేశ్వరరావు, కృష్ణ, సుధాకర్, సాయి స్వరూప్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు పత్రం ఇవ్వకుండా అధికారిక కార్యక్రమాలకు పిలవటం సరికాదు

**–సిఐటియు**



కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్) – జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలకు గుర్తింపు పత్రం ఇవ్వకుండానే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా పిలవటం సరికాదని సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడుస్తున్న గుర్తింపు పత్రం ఇవ్వ లేదని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధం అని ఆయన తెలిపారు. ఇప్పటివరకు గుర్తింపు పత్రం ఇవ్వకుండా అనేక అధికారిక కార్యక్రమాల్లో సింగరేణి యాజమాన్యం గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా మైన్ లెవెల్ నుంచి సింగరేణి ఉన్నత స్థాయి వరకు అధికారిక కార్యక్రమాలకు పిలుస్తున్నారు ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించటమేనని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఇదే సరైనదని సింగరేణి యాజమాన్యం భావిస్తే సింగరేణి ఎన్నికలు నిర్వహించిన రోజు నుండే గుర్తింపు కాలపరిమితిని పరిగణలోకి తీసుకోవాలని, అలా కాకుండా గుర్తింపు పత్రం ఇచ్చిన నాటి నుండి కాల పరిమితిని లెక్కించటం మానుకోవాలని ఆయన అన్నారు. గతంలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగియగానే అన్ని సంఘాలను సమానంగా చూడాలని డిమాండు చేసిన సంఘాలే నేడు దానికి విరుద్ధంగా వ్యవహరించటం సరికాదని ఆయన అన్నారు. ఇప్పటికైనా యజమాన్యం గుర్తింపు పత్రం ఇచ్చేంతవరకు అన్ని సంఘాలను సమానంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజలను గాయపరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నకోతులను పూర్తిగా పట్టించాలి

**–కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి**



కొత్తగూడెం అర్బన్ ,సూర్య(మేజర్ న్యూస్) – కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డు కూలీ లైన్లో ప్రజలను, కరుస్తూ పిల్లలను పెద్దలను భయభ్రాంతులకు గురిచేస్తూ కరుస్తున్న వీధుల్లో తిరుగుతున్న పిచ్చి కుక్కలను పట్టించి మున్సిపాలిటీ అధికారులకు అప్పగించడం జరిగిందని అ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా వార్డులోని రామకృష్ణ హాస్పిటల్ లైన్ లో సుమారు 25 మందిని కరిచి మున్సిపాలిటీ వారికి కూడా దొరక్కుండా తిరుగుతున్న కుక్కలను పట్టించడం జరిగిందని తెలిపారు. ప్రజలను, పెద్దలను, చిన్నారులను గాయపరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న కుక్కలును, కోతులను పూర్తిగా పట్టించాలని కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# సమాచారం మాకు ఇవ్వండి....బహుమతి మీరు పొందండి

**– గ్రామాల్లో పోస్టర్లు ఏర్పాటు చేసిన ఎస్ఐ వెంకటప్పయ్య**






పినపాక, సూర్య (మేజర్ న్యూస్)– మావోయిస్టుల సమాచారం ఇస్తే బహుమతి అందజేయనున్నట్లు ఈ.బయ్యారం ఎస్సై వెంకటప్ప య్య తెలిపారు. మావోయిస్టులపై ప్రకటించిన రివార్డులు ఉన్న వివరాలతో కూడిన ఫ్లెక్సీలను జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పినపాక మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, బస్ స్టేషన్లలో , రద్దీ ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేశారు. ' సమాచారం మాకు – బహుమతి మీకు ' అనే శీర్షిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సంఘ విద్రోహశక్తుల వివరాలను సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# మాజీ కౌన్సిలర్ వాసుకు తృటిలో తప్పిన ప్రమాదం.

ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్)– ఇల్లందు పట్టణంలోని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎలమందల వాసు టూ వీలర్ పై వస్తుండగా సిపిఐ ఎం ఆఫీసు పక్కనగల ప్రాంతంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. నుదుటిపై గాయాలయ్యాయి. దీంతో అక్కడున్న మిత్రులు స్థానిక ప్రభుత్వ వైద్య ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. ప్రభుత్వ వైద్యుల వైద్యం చేసి కట్టుకట్టి ప్రమాదం లేదని తెలిపారు. మాజీ కౌన్సిలర్ వాసుకి ప్రమాదం జరిగిందని తెలియడంతో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, మునిసిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, ఎలమందల వాసు భార్య ప్రస్తుత మున్సిపల్ కౌన్సిలర్ ఎలమందల వాసు వీణ తొ పాటు బందు మిత్రులు శ్రేయోభిలాషులు హాజరై విషాదం వెలిబుచ్చారు.



# సహకార సంఘాలతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**– ఎంపీపీ మంజు భార్గవి**

ఆళ్ళపల్లి, సూర్య (మేజర్ న్యూస్)– సహకార సంఘాలతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని ఎంపీపీ మంజు భార్గవి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాల అవగాహన సదస్సు గ్రామ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల సహకారంతో నిర్వహించాలని నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని వాటిని కట్టడి చేయాలని తెలిపారు. వ్యాపారస్తుల షాపులు తనిఖీ చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు రాకముందే గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖతో చర్చించారు. ఆయా శాఖలో తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కొమరం హనుమంతు, ఎంపీడీవో రామా దేవి, ఎంపీ ఓ బత్తిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com
గురువారం 30, మే 2024

# ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి



**- 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పించాలి**
**- జర్నలిస్టుల పిల్లలకు రాయితీలు ఇవ్వాలి**
**-ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాలు**

కొత్తగూడెం కలెక్టరేట్,సూర్య(మేజర్ న్యూస్)- ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని,25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పించాలని ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాలు కోరాయి. బుధవారం ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాకు జిల్లాలో ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని, రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి వీరభద్రం, పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, జిల్లా పిడిఎస్ యూ జిల్లా కోశాధికారి గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్యా అభిమన్యు, టీపిఎఫ్ జిల్లా నాయకులు ఎట్టి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్ రామ్ చరణ్ జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని నీరుగారుస్తూ యదేచ్ఛగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారనీ, ప్రతీ యేటా 15 నుండి 30 శాతం ఫీజులు పెంచుతున్నారనీ తెలిపారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్నాయరనీ, విద్యా హక్కు చట్టం -2009 ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పించాలని, ఎక్కడా ఉచితంగా ఇవ్వట్లేదని, జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించాలని కోరారు. ఫీజుల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మాలోత్ కవిత, రాకేష్ రెడ్డి ల గెలుపు ఖాయం

**- తెలంగాణ ఉద్యమ నాయకుడు ఖాజా**



ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)-మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్ పై పోటీ చేసిన మాలోత్ కవిత, అదేవిధంగా ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ఏనుగుల రాకేష్ రెడ్డి ల విజయం ఖాయమని తెలంగాణ ఉద్యమ నేత, పార్టీ సీనియర్ నాయకులు ఎండి ఖాజా వెల్లడించారు. అమలు చేయలేని ఆరూ గ్యారంటీలను ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నవ్వుల పాలు అయిందని ఖాజా విమర్శించారు. మోసపోయామని తెలుసుకున్న తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని ఆయన అన్నారు.

## ఎండదెబ్బకు మృతి చెందిన రజబెల్లి

**-మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.**



ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)- గత 30 సంవత్సరాలుగా ఇల్లందు బొగ్గు కాటా వద్ద కార్మికుడిగా పనిచేసిన రజబెల్లి సంవత్సర కాలంగా బొగ్గు అందుబాటులో లేకపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు అడ్డా మీద పనికి వెళ్లే వాడని ఈ క్రమంలో బుధవారం ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు మృతి చెందాడని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఇల్లందు పట్టణ కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి తెలిపారు. రజబెల్లి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కోల్ ట్రాన్స్పోర్ట్ అధ్యక్షులు వరద రామచంద్రయ్య నల్ల శ్రీను, లారీ ఓనర్స్ అధ్యక్షులు షేక్ మౌలానా మృతుని ఇంటికి వెళ్లి మృతుడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సర కాలంగా బొగ్గు అందుబాటులో లేకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకునేందుకు కొందరు హైదరాబాద్ కు వెళ్లారని మరికొందరు ఇల్లందు అడ్డ మీద పనికి వెళుతుండే వారిని ఈ క్రమంలో ఎన్నడూ లేని ఎండను తట్టుకోలేక రజబలి వడదెబ్బకు బలి అయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రజబలికి భార్య,నలుగురు కూతుర్లు ఉన్నారని నలుగురు కూతుళ్లకు పెళ్లి చేయగా ఒక కూతురికి విడాకులై ఇంటి మీదనే ఉన్నదన్నారు. నిరుపేద రజబల్లి కుటుంబాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఆళ్ల నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీను, కుక్కల దుర్గారావు, దేవర వీరస్వామి, పెంటి శ్రీను, సూరిబాబు, మోటం శీను, టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్లా,ఎండి.రహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు



పినపాక, సూర్య (మేజర్ న్యూస్)- విత్తన కొనుగోలు లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన ఎల్చిరెడ్డి పల్లి గ్రామం లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు జాగ్రత్తలు వివరిస్తూ విత్తనాలు కొనుగోలు చేసే సమయం లో రసీదు లు కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ ద్వారా జారీ చేయబడిన లైసెన్స్ గల డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, కొనే సమయం లో కూడా బిల్లు లు కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు.అవి పంట సమయం ముగిసే వరకు ఉంచుకోవాలని చెప్పారు. విప్పిన (లూజు) సంచులు, పగిలిన ప్యాకెట్లు, డబ్బాల విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయరాదని తెలిపారు. విత్తన ప్యాకెట్,సంచి,డబ్బాలపై సీలు ఉన్నాదా? లేదా? సరిచూసుకోవాలని విత్తన ప్యాకెట్లపై ముద్రించిన సమాచారాన్ని బిల్లులో ఉన్న వివరాలతో సరి చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో రైతులు, వంక నరసింహ రావు, తాటి వెంకటేశ్వర్లు, సోడే వెంగళరావు, సోడే లక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు కొమరం లక్ష్మణ రావు, కే రమేష్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ తో రైతులకు అధిక లాభాలు.

**-అశ్వారావుపేట డివిజినల్ మేనేజర్ ఆకుల బాల కృష్ణ**

పినపాక, సూర్య (మేజర్ న్యూస్) - ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చని అశ్వారావుపేట డివిజినల్ మేనేజర్ ఆకుల బాల కృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం పినపాక మండలం జానంపేట గ్రామం లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న తోటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.ఆయిల్ పామ్ తోటలలో మొదట 36 నెలల వరకు వచ్చే గెలలను తీసివేయడం ద్వారా చెట్టు బలంగా తయారవతుందని,లేత తోటలలో వచ్చే కొమ్మ పురుగు నివారణకు ఫి రామోనే ట్రాప్ వాడాలని సూచించారు.విపరీతంగా నీరు పెట్టవద్దని మొక్కల వేర్లకు గాలి కూడా అవసరం అని తెలిపారు .పామ్ ఆయిల్ గెలల రవాణా కు రైతులు భయపడాల్సిన అవసరం లేదని అండగా ఉంటామని మరింత మంది రైతులు పామ్ ఆయిల్ సాగుకు ముందుకు రావాలని పిలిపునిచ్చారు. ఈకార్యక్రమంలో మణుగూరు ఏడీఏ తాతరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ వేర్లు పైపై నే ఉంటాయని 3 సంవత్సరాల వయసు తరవాత తోటలో అంతర పంట సాగు కోసం నేలను దున్నవద్దని అలా చేస్తే మొక్కలు దెబ్బ తింటాయని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో జనంపేట ఏఈవో కేశవరావు, పామ్ ఆయిల్ ఫీల్డ్ ఆఫీసర్స్ ఫణి కుమార్, రాజేష్ రెడ్డి, జగ్గులాల్ రైతులు సూరినేని సత్యనారాయణ, గాధంశెట్టి వెంకటేశ్వరావు, సాగి నవీన్ రాజు, దాట్ల సూరపు రాజు, చిత్తలూరి చంద్రశేఖర్, చెలసాని మొగిలియ్య తదితర రైతులు పాల్గొన్నారు.



## మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేట, సూర్య (మేజర్న్యూస్)-అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ బుధవారం అశ్వారావుపేట మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లిలో కుంజా వెంకటేశ్వరరావు, ముందుగా జమ్మిగూడెం గ్రామానికి చెందిన సింగలూరి కృష్ణ కుమార్తె ఓణీల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అదే విధంగా వేదాంతపరం గ్రామానికి చెందిన కూన సింహాచలం అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని గోపన్నగూడెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కబడి గంగరాజు కుటుంబాన్ని జారె పరామర్శించారు. ఈ క్రమంలో ప్రభుత్వం తరపున పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని అన్నారు. అదే విధంగా గ్రామంలో కలియ తిరిగి గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు కాంగ్రెస్ జూపల్లి రమేష్, ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అరుణ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది



**-ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్**

కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్)- కొత్తగూడెం ఏరియాలోని రామవరం పంజాబ్ గడ్డ లోని లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అరుణ్ ఖాన్ మరణవర్త తెలుసుకొని రామవరం లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి ఇంటికి వెళ్లి వారిని పరమర్శించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వారికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కి చివరి శ్వాస వరుకు పార్టీ కి సేవలందించిన అరుణ్ ఖాన్ మరణించడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భవిష్యత్తు లో వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటాందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ కే .హుస్సేన్, ఎస్ కే.జానీపాషా, సత్యరాజు, గోరె బాబురావు, గడ్డం రాంచందర్, హరిసింగ్,జెట్టి మోహన్, జంపాల సారంగపని, భూక్యా నాగరాజు, బోలసింగ్, కుక్కల శివ, ఎండీ అబ్బస్, నజీర్, లాల్ మహుమద్, ఉర్సు వెంకన్న, గణేష్, మల్లరపు కొమరయ్య, కుమార్, శ్రీనివాస్ నాయక్,మూడు మోహన్,పాషా తదితరులు పాల్గొన్నారు.

సూర్య

గురువారం 30 మే 2024

# నిండు నూరేళ్లు వర్ధిల్లాలి

## -ఘనంగా పులిపాటి జన్మదిన వేడుకలు
## -తిరుమల శ్రీవారి దర్శనంలో పులిపాటి దంపతులు





**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**
నిరాడంబరుడు, స్నేహశీలి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పులిపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం పౌర సమితి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పులిపాటి పుట్టినరోజు వేడుకల్లో ప్రముఖులు కేక్ కత్తిరించి పులిపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తిరుమల శ్రీవారి దర్శనంలో ఉన్నప్పటికీ పులిపాటి మిత్రులు జన్మదిన వేడుకలను హృదయ పూర్వక వాతావరణంలో జరపడం గమనార్హం. కల్మషం ఎరుగని స్నేహశీలి డాక్టర్ పులిపాటి ప్రసాద్ మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని అభిలషించారు. ఇదే రోజున ఆయన సతీమణి పద్మ ప్రియ జన్మదినం కావడం విశేషం. పులిపాటి దంపతుల బర్త్ డేను పురస్కరించుకొని ఖమ్మం బైపాస్ రోడ్డు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, వస్త్ర దానం నిర్వహించారు. సేవల్లో మేటిగా చెప్పుకునే పులిపాటికి ఇష్టమైన సేవా కార్యక్రమాలను చేపట్టి ఆయన నూరేళ్లు జీవించాలని ఆత్మీయులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పులిపాటి ప్రసాద్ విద్యాసంస్థల అధ్యాపకులు, మిత్రులు, పౌరసమితి సభ్యులు, వాసవిక్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, ముకుంద సేవా ట్రస్ట్ చైర్మెన్ శ్రీమతి చెరుకూరి రాజి (రాజ్యలక్ష్మి), కావ్య హాస్పిటల్ వైద్యురాలు %ణతీ%. కావ్య చంద్ యాలముడి పాల్గొని కేక్ కట్ చేసి పులిపాటి ప్రసాద్ దంపతులకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హాస్పటల్ లో పేషెంట్స్ కు, రైల్వే స్టేషన్ లో పేదలకు అరటి పండ్లు బ్రెడ్ పంచి పెట్టారు. వృద్ధ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం, వస్త్ర దానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కావ్య, ఖమ్మం పౌర సమితి నాయకులు ఎస్ కె ఖాసిమ్, సతీష్ చౌదరి, మజీద్, ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గోళ్ల రాదాకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుమ్మడవల్లి శ్రీను ఉపాధ్యక్షుడు మాశెట్టి వరప్రసాద్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(%ూ.=.ూ%) కొల్లా రామారావు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు కొంకిమళ్ల మృత్యుంజయ గుప్తా, తెలంగాణ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీకాంత్, కొదుమూరి భద్రయ్య, బూర్లె పుల్లారావు, పత్రికా రిపోర్టర్ సంతోష్ చక్రవర్తి, పులిపాటి ప్రసాద్ విద్యా సంస్థల ప్రిన్సిపల్స్ అండ్ స్టాప్ కే రామకృష్ణ, ప్రతాప్, శ్వేత, అరుణ, వై ఎన్ రామకృష్ణమూర్తి, సతీష్, శ్రీనివాస్, ప్రవీణ్, స్వాతి, ముస్తఫా, ప్రవణ్య, సాయి శ్రీకృష్ణవేణి, పాషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు

## -విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి
## - ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి




**ముదిగొండ, సూర్య మేజర్ న్యూస్:-**
సొసైటీ ద్వారా రైతులకు పచ్చిరొట్టె విత్తనాలను పంపిణీ చేస్తున్నామని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి చెప్పారు. ముదిగొండ సొసైటీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వము అందిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు.ముదిగొండ సొసైటీలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.పచ్చిరొట్ట విత్తనాలు జిలుగు,జనుము విత్తనాలు పంట భూముల భూసారం పెంచుకునేందుకు రైతులు ఉపయోగించుకోవాలన్నారు.జీలుగు 30 కేజీల బస్తా రూ1116 ,జనుము,40 కేజీల బస్తా రూ1448 ధర ఉందని,పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ పొలం పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ తో,స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి కూపన్ తీసుకొని సొసైటీలో విత్తనాలను పొందవచ్చున్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను అందజేస్తుందని,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సొసైటీ చైర్మన్ యలగొండస్వామి అన్నారు.

# పంటకాలువలుపునరుద్ధరణ చేయాలిసాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలి

## -తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**వైరాసూర్యమేజర్ న్యూస్:ు**
పంట కాలువలు పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు.బుధవారం వైరా మండలం లో సోమవరం మైనర్ పంట కాలువలు రైతు సంఘం బృందం పరిశీలించింది ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కొన్ని చోట్ల పంట కాలువలు నామ రూపాలు లేకుండా అడవిని సైతం తలపిస్తుంది అని అన్నారు గత రెండు సంవత్సరాలుగా సోమవరం చివరి ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయారని సత్వరమే కాలువలు పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు అనేక చోట్ల తూములు ధ్వంసం అయిన పరిస్థితి నెలకొంది అని అన్నారు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పంట కాలువలు పునరుద్ధరణ చేయాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు,సిఐటియు జిల్లా నాయకులు సుంకర సుధాకర్ రైతు సంఘం నాయకులు హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, చెరకు మల్లి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు



**ఎర్రుపాలెం,సూర్య మేజర్ న్యూస్ :-**
ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా రైతులకు 60 శాతం సబ్సిడీపై అందించే జీలుగు విత్తనాలనురైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కొండూరు విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.బుధవారం నుండి మండల పరిధిలోని ఎర్రుపాలెం ,రాజుపాలెం, అయ్యవారిగూడెం, మొలుగుమాడు, తక్కెళ్ళపాడు, మీనవోలు, పెద్ద గోపవరం సహకార సంఘ అధ్యక్షులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.రాజుపాలెం సహకార సంఘం పరిధిలోని రైతులకు బుధవారం జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సహకార సంఘాల పరిధిలోని రైతులకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుండి 60 శాతం సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నట్లు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు.జీలుగు విత్తనాలు కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీని ఆయా సంఘాల పరిధిలోని రైతు వేదికలవద్దకు వచ్చిఏఈఓలకు అందించి పర్మిషన్ తీసుకోవాలన్నారు.ఒక హెక్టార్ కు కావలసిన 34 కేజీల జీలుగు విత్తనాల బస్తా పూర్తి ధర 2,790 రూపాయలు అని తెలిపారు.రైతుకు దీనిపై 1,674 రూపాయలు సబ్సిడీ ప్రభుత్వ అందిస్తుందని అన్నారు. సబ్సిడీ పోను 1,116 రూపాయలు చెల్లించి రైతు 34 కేజీల జీలుగు బస్తా తీసుకోవచ్చని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ఆయా సొసైటీల అధ్యక్షులు, సీఈవోలు,కస్టర్ల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా టిపిటిఎఫ్ ఆవిర్భావ మరియు దశాబ్ది ఉత్సవాలు..



**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్:**
తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం ఈరోజు కూసుమంచి మండల వనరుల కేంద్ర ముందు జరిగింది. ఈ కార్య్ర కమానికి జిల్లా ఉపాధ్య క్షుడు మల్లయ్య పాల్గొని జెండాను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడక ముందు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ గా ఉన్న మన సంఘం రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ గా అవతరించి ఈనాటితో పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఈరోజు దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులకు తొమ్మిది సంవత్సరాల నుండి ప్రమోషన్లు, ఆరు సంవత్సరాల నుండి బదిలీలు లేక తీవ్ర అసంతృప్తితో ఉన్నారనిటీచర్స్ బదిలీలు, ప్రమోషన్లు షెడ్యూల్ను వెంటనే ప్రకటించి, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం టెట్ లేకుండా ప్రమోషన్స్ టీచర్ల బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న డిఏలు, పి.ఆర్.సి అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని.పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు ,మన ఊరు మనబడి పాఠశాలల కింద మంజూరైన గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీలో నింపేంత వరకు విద్యా వాలంటీర్లను నియమించలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ప్రతినెల ఒకటో తారీఖున చెల్లించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా బాధ్యులు రాంకోటి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవేందర్, శంకర్ మండల నాయకులు వీరన్న, యాకయ్య ,బాబురావు, భద్రు నాగేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామ దేవతలకు పూజలు





**ఏనుకూరు సూర్య మేజర్ న్యూస్:**

మండల పరిధిలోని తూతక లింగన్నపేట గ్రామంలో బుధవారం గ్రామ దేవతలకు ఘనంగా అభిషేకాలు,పూజా కార్యక్రమాలు జరిగాయి. మై సమ్మ తల్లి వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరి మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను సమర్పించి వర్షాలు బాగా కురవాలని,పంటలు బాగా పండాలని,ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామ దేవ తను వేడుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి -జే.డి.ఏ.





**వైరా.సూర్యమేజర్ న్యూస్ః-**

ఖమ్మం జిల్లాలో 14'067 పచ్చిరొట్ట విత్తనాలు సొసైటీలో యందు అందుబాటులో ఉన్నాయి 60 శాతం సబ్సిడీపై దయించ పిల్లి పెసలు కావున రైతులు తమ పట్టా పాస్ పుస్తకం ఆధార్ కార్డు మరియు ఆన్లైన్ రసీదు పొంది తమకు సంబంధించిన సొసైటీ యందు 60 శాతం సబ్సిడీపై విత్తనాలు పొందవచ్చు. అంతేకాకుండా జిల్లాలో ఇప్పటివరకు325000 పత్తి విత్తన ప్యాకెట్లు లైసెన్స్ ఉన్న డీలర్ షాపుల యందు అందుబాటులో ఉన్నాయి. పత్తి విత్తుకోటానికి అనువైన వర్షపాతం ఎర్రనేలను60 %ఎఎ% నల్ల నేలలు60-80 %ఎఎ% ఉన్నప్పుడు మాత్రమే మొలకెత్తడానికి అనుకూలమైన వాతావరణం. పత్తి విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు లైసెన్స్ ఉన్న డీలర్డీలర్ షాపు వద్ద మాత్రమే కొనుగోలు చేయాలనచేయ గలరు. లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలను కొనుగోలు చేయరాదు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తన ప్యాకెట్ మరియు బిల్లును పథకాలు పూర్తి అయ్యేవరకు జాగ్రత్తగా ఉంచాలి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అదీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్యాక్ చేసిన మరియు లేబుల్ చేసిన విత్తనానికి మాత్రమే కొనుగోలు చేయాలి. గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయరాదు. తెలంగాణలో ఆయిల్ కొనసాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఒకసారి నటితే40 సంవత్సరాల వరకు దిగుబడి నిస్తాయి. మూడు సంవత్సరాల తర్వాత ఫలసాయం ఇస్తాయి మీరు సమృద్ధిగా 365 రోజులు ఉండాలి ఎర్రనేలఎర్రనేలలు. మీరు నిలువ ఉండని నల్ల నేలలు. ఉండు నేలలు దీని సాగుకు అనుకూలం.

## గొర్రెలు చనిపోయి నష్టపోయిన బాధితులను పరామర్శించిన -డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్

**తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-**

తిరుమలాయపాలెం మండలం రాజారం లో ఇటీవల కలుపు మందు కొట్టిన పెసర చేలో మేత మేసి అమాయక మూగజీవాలైన గొర్రెలు దాదాపు 200కు పైగా మృత్యువాత పడిన విషయం విదితమే. బుధవారం రోజు అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, రాష్ట్ర నాయకులు దుబాకుల శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండలం గొర్రెల సంఘం అధ్యక్షులు దొడ్డి సాంబయ్య గొర్రెల బాధితులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ, రసాయనిక మందులు వాడిన చేనులోకి మేతకు వెళ్లి గొర్రెలు చనిపోవడం చాలా దురదృష్టకరమని కేవలం గొర్రెల వృత్తి పైన ఆధారపడి జీవించే కుటుంబాలు 30 లక్షల రూపాయలకు పైగా తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, విచారం వ్యక్తం చేశారు. గొర్రెల బాధితులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం జరిపించాలని డిమాండ్ చేశారు.గతంలో కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి గొర్రెకు ఇన్సూరెన్స్ పథకం ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేయకున్నట్లయితే గొర్రెలకు బీమా పథకం ద్వారా ఈరోజు బాధితులందరికీ న్యాయం జరిగేదని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం నుండి సహకారం అందించటానికి, పొంగులేటి శీనన్న ద్వారా కృషి చేస్తానని బాధితులకు మల్లిబాబు యాదవ్ హామీ ఇచ్చారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన 559, 1016 జీవోలను పునరుద్ధరించి





జీవాల మేత కొరకు చెరువు శిఖం భూములు, లోతట్టు ప్రాంతాలను సంఘాలకు అప్పగించాలని, రాష్ట్రంలోని ప్రతి గొర్రెకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గొర్రెలు మంజూరు చేయాలని మల్లి బాబు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల మల్లయ్య కొమ్ము సైదులు, పేర్ల బయన్న, పేర్ల లింగయ్య, గుండాల సైదులు, గుండాల మల్లయ్య, పేర్ల గాలయ్య, పరాల మల్లయ్య,గుండాల గంగయ్య, పేర్ల బిక్షం, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య వీరబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## లోక్ సభ సాధారణ ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్

**ఖమ్మం, (సూర్య బ్యూరో):**

లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్ల గురించి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.





ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోకసభ సాధారణ ఎన్నికల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సామాగ్రి, స్టేషనరీ సేకరణ పూర్తి చేయాలన్నారు. లెక్కింపు అనంతరం ఇవిఎం యంత్రాలను ఇవిఎం గోడౌన్ కు తరలింపు ప్రక్రియకు వాహనాల, కూలీల ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు విధుల సిబ్బంది, పోలీసు సిబ్బంది కి అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. పబ్లిక్ కమ్యూనికేషన్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలన్నారు. మీడియా కేంద్రం ఏర్పాటుచేసి, ఫలితాల ప్రదర్శనకు ఎల్ఇడి స్క్రీన్, సమాచారం కొరకు టెలివిజన్ల ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన విధంగా బ్యారికెటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు, సిబ్బంది, ఏజెంట్లకు పాసుల జారీచేయాలన్నారు. సెగ్మెంట్ల వారిగా ఫలితాల చేరవేతకు లైజన్ అధికారుల నియామకం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం లోకి వచ్చేవారిని ఫ్రిస్కింగ్ చేసి, తనిఖీల అనంతరం లోనికి అనుమతించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకు ండా పార్కింగ్ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాస య్య, జెడ్పి సిఇఓ వినోద్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ ప్రసాద్, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మీనన్, అనురాధ బాయి, సత్యనారాయణ, రాంబాబు, ఇడిఎం దుర్గాప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

### -ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్**

సత్తుపల్లి నియోజకవర్గ పరిదిలోని వేంసూరులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను వేంసూరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని ,గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. వేంసూరు ఎస్.ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా.

సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన కలపాల రాంబాబు, వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన రాయల పవన్ సాయి కృష్ణ లు పండు ,సందీప్ అనే స్నేహితులతో కలిసి సీలేరు ప్రాంతం నుంచి ఐదు కేజీల గంజాయిని తీసుకురావడం జరిగిందని, ఈ క్రమంలోనే కొంత గంజాయిని ఈ మధ్యకాలంలో దమ్మపేట మండలానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించడం జరిగిందని ఆ సమయంలో వీరిపై కేసు నమోదు కాగా పవన్ సాయి కృష్ణ పరారైనట్లు తెలిపారు. ఈ క్రమంలోనే 400 గ్రాముల గంజాయిని పవన్ సాయి కృష్ణ ,రాంబాబులు బైక్ పై రేజర్ల లింగపాలెం మీదుగా లంకపల్లి వెళ్లే క్రమంలో వేంసూర్ అంబేద్కర్ నగర్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా పట్టుబడారని, అనుమానం వచ్చి వెహికల్ ను చెకింగ్ చేయగా బైకులో 400 గ్రాములు గంజాయి దొరికిందని తెలిపారు. కాగా పండు సందీప్ పరారీలో ఉన్నారని, వీరి వద్ద నుండి బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు